ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం : 28.5
కనిష్ఠం : 17.4
**



సూర్యాపేట

5

సోమవారం 24 నవంబరు 2025

శుభకార్యాలకు విరామం



- ఈ నెల 26 నుంచి శుక్రమౌఢ్యం
- ఫిబ్రవరి 17 తర్వాతే ముహూర్తాలు
- మాఘమాసం వచ్చేదాకా

వివరాలు 7వ పేజీలో

చికెన్ ధరలు	లైవ్ : రూ.140	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.240

జిల్లాలోని పంచాయతీల వారీగా రిజర్వేషన్ల వివరాల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



పల్లెల్లో ఎన్నికల సందడి

- రిజర్వేషన్లతో వేడెక్కిన రాజకీయం
- ఎన్నికలు సమాయత్తం అవుతున్న ఆశావహులు

(ఆంధ్రజ్యోతి- హుజూర్‌నగర్)

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా రిజర్వేషన్లు ఖరారు కావడంతో పల్లెల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా మారింది. ఆశావహుల అప్పుడే సందడి చేస్తున్నారు. సెప్టెంబరులో రిజర్వేషన్ల ప్రక్రియ జరిగినా కోర్టు కేసులతో నిలిచిపోవడంతో నిరాశచెందారు.

పాత పద్ధతిలోనే ఎన్నికల నిర్వహణ ఉంటుందనిచెప్పడంతో ఉత్సాహం నెలకొంది. అయితే జనరల్ స్థానాల్లో పెరగడంతో బీసీలు కొంత నిరాశ, నిస్పృహలకు లోనయ్యారు. హుజూర్‌నగర్ డివిజన్‌లో 146 గ్రామపంచాయితీలకు ఆదివారం రిజర్వేషన్లు ప్రకటించారు. 75స్థానాలకు పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కాగా 71స్థానాలు జనరల్‌కు కేటాయించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన డ్రాకు డివిజన్‌లోని ఏడు మండలాలకు చెందిన ప్రధానపార్టీల నాయకులు తరలిరావడంతో సందడి నెలకొంది. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తవడంతో ఆశావహులు గ్రామాల్లో వాలి పోయారు. ఎన్నికల పోరుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. రిజర్వేషన్లను

(మిగతా 8వ పేజీలో)

రిజర్వేషన్లకు గెజిట్ విడుదల

- సర్పంచ్, వార్డు స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు
- ఎస్టీలకు 111, ఎస్సీలకు 91, బీసీలకు 66, జనరల్‌కు 218 కేటాయింపు

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారయ్యాయి. జిల్లాలోని 486 గ్రామపంచాయతీలు, 4388 వార్డులకు కలెక్టర్ తేజ్ ఎనందలాల్ పవార్ ఆదివారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా 486 గ్రామపంచాయతీల్లో గిరిజనులకు 111 గ్రామపంచాయతీలు రిజర్వ్ చేయగా అందులో 62 గ్రామపంచాయతీలు 100 శాతం గిరిజనులు కలిగిన తండాలు ఉన్నాయి.



హుజూర్‌నగర్‌లో పరిషత్ కార్యాలయంలో లాటరీ తీస్తున్న అధికారి

అదేవిధంగా ఎస్సీలకు జిల్లాలో 91, బీసీలకు 66 గ్రామపంచాయతీలను కేటాయించారు. మిగిలిన 218 గ్రామపంచాయతీలను జనరల్‌కు రిజర్వ్ చేశారు. కాగా జిల్లాలో 213గ్రామ పంచాయతీలకు

(మిగతా 8వ పేజీలో)

బీసీ వార్డుల్లేని నశీంపేట

ఆత్మకూరు(ఎస్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్, వార్డుల స్థానాలకు కేటాయించిన రిజర్వేషన్లు విస్మయం కలిగించేలా ఉన్నాయి. 100శాతం ఎస్టీ జనాభా ఉన్న చోట ఎస్టీలకే కేటాయించాలనే నిబంధన ఉన్నా మండలంలోని మంగళితండాను జనరల్‌కు కేటాయించారు. అదేవిధంగా మండలంలో 30 పంచాయతీలు ఉండగా నాలుగు మాత్రమే బీసీలకు కేటాయించారు. రెండు జనరల్ కుటుంబాలు బోరింగ్‌తండాను జనరల్‌కు కేటాయించారు. అదేవిధంగా ఎనిమిది వార్డులున్న నశీంపేట పంచాయతీలో ఒక్కటి కూడా బీసీలకే కేటాయించలేదు. బీసీలకు స్థానాలు తగ్గడాన్ని బీసీ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. సెప్టెంబరులో చేసిన రిజర్వేషన్లలో 4 వార్డులు కేటాయించగా తాజాగా ఒక్కటీ కేటాయించకపోవడం ఏంటని బీసీ నాయకులు గుండాల నాగరాజు యాదవ్, బోయిన ఐలయ్య, కాంపాటి సైదులు గౌడ్, మామిడి నాగలింగం గౌడ్, దాసరి మల్సూర్ ముదిరాజ్, దంతూరి సోమయ్య గౌడ్, శీలం వెంకన్న గౌడ్, గుండాల పరమేష్ యాదవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

సత్యసాయి బోధనలు ఆచరణీయం



జిల్లా పోలీస్ కార్యాలయంలో బాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేట క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి బాబా బోధనలు నేటి సమాజానికి ఆచరణీయమని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. ఆదివారం శ్రీసత్యసాయి జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజానికి సేవ చేసేందుకు బాబా విద్యాలయాలు, ఆస్పత్రులు, తాగునీటి ప్రాజెక్టులతో పాటు అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. శ్రీసత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, ఎస్‌బీఐ రామారావు, ఆర్ఐ నారాయణరాజు, ఆర్ఎస్ఐలు అశోక్, సాయిరాం, సురేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యం



నేరేడుచర్లలో మాట్లాడుతున్న డీఎస్‌వో మోహన్‌రావు

నేరేడుచర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పౌరసరఫరాల అధికారి వీ మోహన్ రావు తెలిపారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఈ సీజన్‌లో 346 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 94,698 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. వీటిలో 159 ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, 13 మెప్మా, 148 ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో, 22 ఎఫ్‌బీవో(రైతు సహకార సంఘాలు) 4 హాకా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వాటి ద్వారా 41,626 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 53,071 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48గంటలలో రైతుల ఖాతాలో నగదును జమ చేస్తున్నామన్నారు. ఇంకా సీజన్ పూర్తికాలేదని అనుకున్న ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో సోమసుందరరెడ్డి, ఎంపీవో నాగరాజు ఉన్నారు.

బీసీలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలి



సూర్యాపేటలో మాట్లాడుతున్న లింగయ్యయాదవ్

సూర్యాపేట అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 46ను వెనక్కి తీసుకోకపోతే బీసీలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ లింగయ్యయాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 60ఫీట్ల రోడ్డులో నిరసన వ్యక్తం చేసి, మాట్లాడారు. 42శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి ప్రస్తుతం తుంగలో తొక్కిందన్నారు. నిరసన అనంతరం జీవో నెంబర్ 46 ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో మేడిపల్లి వంశీ, మధుసూదన్, బంటి, శశాంక్‌యాదవ్, అఖిలేష్‌యాదవ్, గణేష్, మనోజ్ పాల్గొన్నారు.

భగవంతుడికి భక్తి ద్వారా దగ్గర కావాలి



భగవద్గీత సత్సంగంలో పాల్గొన్న మహిళా భక్తులు

హుజూర్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భక్తితో భగవంతుడికి దగ్గర కావాలని, ప్రతీ మనిషి సత్ప్రవర్తన కలిగి ఉండాలని హైదరాబాద్‌లోని ఇస్కాన్ సంస్థ గురూజీ హృషికేశ్‌దాస్ కోరారు. ఆదివారం పట్టణంలోని వర్తక సంఘం భవనంలో భగవద్గీతలోని 14వ అధ్యాయంపై సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ప్రవర్తన, ఆలోచనలు, స్వభావం ఇవన్ని సత్వం, రజసం, తమసం అనే మూడు గుణాల ప్రభావంతో రూపుదిద్దుకుంటాయన్నారు. సాత్విక గుణాన్ని పెంపొందించుకుంటే మన జీవనంలో శాంతి, జ్ఞానం, భక్తి సహజంగా వికసిస్తాయన్నారు. ఈ సందర్భంగా విష్ణుసహస్ర నారాయణ పారాయణం, దామోదర హారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు రమేష్‌కవిత దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మట్టపల్లి శ్రీమన్నారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నాగలక్ష్మి, సుజాత, వెంకటలక్ష్మి, నర్సింహారావు, రాధ, శ్రీదేవి, గాయత్రి, లక్ష్మణ్, హరీష్, చందు, తదితరులు పాల్గొన్నారు.

మదర్ డెయిరీ అప్పుల ఊబిలో..

- రూ.35కోట్లకు పైగా వివిధ బ్యాంకుల్లో అప్పు
- నెలకు రూ.45లక్షల మేర వడ్డీలు
- సహకారం ఇచ్చేందుకు నిరాకరించిన ఎన్‌డీడీబీ?
- పాడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించని వైనం
- ఏడు బిల్లులు, రూ.20కోట్లు పెండింగ్

పాడి రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ఏర్పాటైన నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (నార్మూల్-మదర్‌డెయిరీ) పీకల్లోతు అప్పుల ఊబిలో చిక్కుకుంది. బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులకు వడ్డీ భారం పెరుగుతోంది. అప్పుల కారణంగా పాడి రైతులకు బిల్లుల చెల్లింపు కష్టతరంగా మారింది.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి

పాడి రైతులకు ప్రతీ నెలలో నార్మూల్ రెండుసార్లు పాల బిల్లులు చెల్లించాలి. అయితే బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతో పశుపోషణకు పాడిరైతులు ఇబ్బంది పడుతున్నారు. నార్మూల్ పరిధిలో మొత్తం 290 (ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలు) పాల సంఘాలు ఉన్నాయి. ఈ పాల సంఘాల ద్వారా నిత్యం దాదాపు 50వేల నుంచి 60వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. పాడి రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు రూ.20కోట్ల మేర ఉన్నాయి. ఇప్పటివరకు ఏడు బిల్లులకు చెందిన ఈ మొత్తాన్ని రైతులకు ఇవ్వాల్సి ఉంది. ఒక్కో గ్రామానికి రూ.20లక్షలకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఒక్కో రైతుకు కనీసం రూ.5వేల నుంచి రూ.20వేల వరకు బిల్లులు బకాయి ఉన్నట్లు సమాచారం. పశువులకు నిత్యం దాణా, పిట్టు లేనిది పాల ఉత్పత్తి సరిగా రాదు. ఈ నేపథ్యంలో



పాల బిల్లుల కోసం నిరసన తెలుపుతున్న పాడి రైతులు (ఫైల్)

రైతులు పాడి గేదెలు, ఆవుల కోసం దాణాతోపాటు ఇతర విత్తనాలు, పశుగ్రాసంకోసం రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో దాణాతోపాటు వ్యాపారుల నుంచి ఉద్దెర కూడా లభించడంలేదని రైతులు వాపోతున్నారు.

నిరాకరించిన ఎన్‌డీడీబీ?

పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన నార్మూల్‌ను గట్టెక్కించేందుకు పాలకవర్గం జాతీయ పాడి అభివృద్ధి బోర్డు(ఎన్‌డీడీబీ)ను ఆశ్రయించింది. ఎన్‌డీడీబీ చైర్మన్‌తో ప్రత్యేకంగా సమావేశమైంది. నార్మూల్‌ను గట్టెక్కించేందుకు ఎన్‌డీడీబీ తొలుత సంసిద్ధం వ్యక్తం చేసింది. ప్రతినిధుల బృందాన్ని పంపింది. ఈ మేరకు ఎన్‌డీడీబీ ప్రతినిధులు నార్మూల్ పరిపాలనా అంశాలు, ఆర్థిక పరిస్థితి, రైతులకు చెల్లిస్తున్న బిల్లులు, తదితర అంశాలను అధ్యయనం చేసింది. నార్మూల్ సంస్థ అప్పుల్లో ఉండగా, లాభాల్లో ఉన్నట్టుగా ఆడిట్ రిపోర్టులు రూపొందించి, పలు బ్యాంకుల ద్వారా రుణాలు పొందినట్లు ఎన్‌డీడీబీ గుర్తించినట్లు సమాచారం. సంస్థకు అప్పు ఉన్నట్టుగా ఒక ఆడిట్, లాభాల్లో ఉన్నట్టుగా మరో ఆడిట్‌ను రూపొందించడంతో నార్మూల్‌ను తమ సంస్థలో కలిపేందుకు ఎన్‌డీడీబీ సందేహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మరోవైపు ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ కింద నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే సహకార రంగం చట్టం ప్రకారం నార్మూల్ సంస్థకు గ్రాంట్ మంజూరు చేసే అవకాశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటు ఎన్‌డీడీబీ, అటు ప్రభుత్వ గ్రాంట్ మంజూరుకాకపోవడంతో రైతులకు బిల్లులు చెల్లింపు మరింత జాప్యం జరుగుతోంది.

మొత్తం రూ.35కోట్ల అప్పులు

మదర్ డెయిరీకి ప్రస్తుతం రూ.35కోట్లకు పైగా వివిధ బ్యాంకుల్లో అప్పులున్నాయి. నెలకు రూ.45లక్షల మేరకు వడ్డీలు చెల్లించాల్సి

మిగతా 6వ పేజీలో...

ఐక్యతతో హక్కులు కాపాడుకోవాలి



వెంపటి గ్రామంలో గీతన్నల రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గీత కార్మికులు

తుంగతుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గీతా కార్మికులంతా ఐక్యతతో తమ హక్కులను కాపాడుకోవాలని రాష్ట్ర కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్వర్లు అన్నారు. సూర్యాపేటలో ఈ నెల 28న నిర్వహించే గీతన్నల రణభేరీ రాష్ట్ర నాలుగో సభ వాల్‌పోస్టర్‌ను ఆదివారం తుంగతుర్తి మండలం వెంపటి గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం గీతా కార్మికులకు రావాల్సిన అన్నిరకాల రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. గీతా కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మద్దెల నర్సయ్య, కార్యదర్శి చిర్ర నరేష్, గుండగాని అంజయ్య, గుండగాని వెంకన్న, పోడిశెట్టి అంజయ్య, పొన్నం రాములు, చిర్రా వెంకన్న, గుండగాని రాము, గుండగాని నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

కోదాడ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి 59వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే అండర్-19 క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలకు కోదాడ క్రికెట్ అకాడమీకి చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు ఆల్‌రౌండర్ భూక్య చందు, మరికంటి భువన్‌సాయి, ఓరుగంటి సాయిష్ ఎంపికైనట్లు కోచ్ సిద్ధిక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఈ నెల 24 నుంచి సికింద్రాబాద్ వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను ఎంఈవో ఎండీ సలీంషరీఫ్ అభినందించారని పేర్కొన్నారు. కోదాడ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి సురేష్ సహకారం ఉందని, ముగ్గురు క్రీడాకారులు కొన్ని నెలలుగా నిరంతర సాధన చేశారని ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులను కోదాడ క్రికెట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు షేక్ సలీంషరీఫ్, అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి సురేష్, డాక్టర్ నందకిషోర్, సభ్యులు, ఖాజామియా, జబ్బార్, వేమూరి సతీష్, షేక్ మీరా, తుమ్మల సురేష్, శ్రీకాంత్, బుల్లయ్య, రవీందర్‌రెడ్డి అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అనుమానంతో అంతమొందించాడు

- వివాహిత అనుమానాస్పద మృతిని ఛేదించిన పోలీసులు
- ప్రియుడే నిందితుడు

6

24 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

10 లక్షల కరాటే కిక్స్‌లో పేట విద్యార్థి

సూర్యాపేటటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 10 లక్షల కరాటే కిక్స్ కార్యక్రమంలో జిల్లా కేంద్రానికి చెందిన పిన్నెల్లి రోహిత్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించిందని అందులో రోహిత్ పాల్గొనడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



ఎన్‌కౌంటర్లను నిలిపివేసి చర్చలు జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి

సూర్యాపేట అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న ఎన్‌కౌంటర్లను నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ భవన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోఉన్న బీజేపీ ప్రభుత్వం దేశంలోని అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికే ఆపరేషన్ కగార్ నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు మట్టిపల్లి సైదులు, నెమ్మాది వెంకటేశ్వర్లు, ముల్కలపల్లి రాములు, వేల్పుల వెంకన్న, నర్సింహారావు, శంకర్‌రెడ్డి, జ్యోతి, వెంకటేశ్వర్లు, గోవింద్, రాంబాబు, సాయికుమార్, అంజిబాబు, నాగమణి, రాంబాబు, శ్రీను పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్లు మల్లు నాగార్జునరెడ్డి, మందారి డేవిడ్‌కుమార్, వరికుప్పల వెంకన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ భవన్‌లో నిర్వహించిన ఎస్‌కేఎం సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు మట్టిపల్లి సైదులు, మాధవరెడ్డి, వెంకటేశ్వర్లు, శంకర్‌రెడ్డి, యాదగిరిరావు, కోటగోపి, సైదులు, రాము పాల్గొన్నారు.



సండే సందడి



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి సొంత వాహనాల్లో తరలివచ్చిన భక్తులతో కొండపైన పార్కింగ్ ప్రదేశాలు నిండిపోయాయి. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాలు, మధ్యాహ్నం (ఆరగింపు) కలిపి మూడు గంటల పాటు భక్తులు క్యూలైన్లల్లో వేచి ఉన్నారు. సుమారు 46 వేల మంది భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శనానికి రాగా ప్రత్యేక దర్శనం అర్ధగంట, ధర్మదర్శనం గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. క్యూకాంప్లెక్స్ క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి నెలకొంది.

● ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారి ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. పెద్ద సంఖ్యలో శుభ కార్యాలు, పెళ్లిళ్లు ఉండడంతో హైవేతో పాటు ఇతర లింక్ రోడ్లలో సైతం వాహనాలు బారులు తీరాయి. ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రయాణికులతో కిటకిట లాడింది. బస్సులు దొరకక ప్రయాణికులు అష్టకష్టాలు పడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాల రద్దీ కొనసాగింది. పట్టణంలో ఆదివారం వారాంతపు సంతతో వినియోగదారులతో దుకాణాలు కిక్కిరిసిపోయాయి. అదేవిధంగా నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ నెలకొంది.

● ఆంధ్రజ్యోతి, చౌటుప్పల్ టౌన్, కేతేపల్లి.

మదర్ డెయిరీ.. అప్పుల ఊబిలో

(5వ పేజీ తరువాయి)

వస్తోంది. సంస్థలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి వేతనాలు చెల్లింపులు కూడా అధికంగానే ఉన్నాయి. దీంతో రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించలేకపోతున్నామని సంస్థ ఒప్పుకుంటోంది. సంస్థలో ఉన్న స్థిరాస్తులు విక్రయిస్తే కానీ బయటపడే పరిస్థితి లేదని ఇటీవల జరిగిన మదర్‌డెయిరీ సర్వసభ్య సమావేశంలో ప్రస్తుత పాలకవర్గం ప్రకటించింది. లాభాల్లో నడిచిన డెయిరీని గత పాలకులు తీసుకున్న నిర్ణయాలతో అన్నీ నష్టాలేనని, చిట్యాల, నకిరేకల్, చండూరు, తదితర ప్రాంతాల్లోని మదర్ డెయిరీకి చెందిన భూములపై గత పాలకులు పెద్ద ఎత్తున అప్పులు తేవడంతో తీవ్రంగా నష్టాలు జరిగాయని పేర్కొంది. డెయిరీ నష్టాల్లో కూరుకుపోవడానికి పాలకవర్గమే బాధ్యత వహించాలని, డిస్ట్రిబ్యూటర్‌కు లాభం చేకూర్చే నిర్ణయాలు తీసుకోరాదని, నష్టానికి కారణాలు తెలుసుకుని స్థిర ఆస్తులను విక్రయించకుండా తగిన చర్యలు చేపట్టాలని పాలకవర్గంలోని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. అయితే పాడి రైతులు మాత్రం సంస్థ అప్పులు ఎలా ఉన్నా రైతులకు చేయూతనిచ్చేందుకు ఏర్పడిన మదర్ డెయిరీలో పాలు పోస్తున్న వారికి నెలవారీగా బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

స్థిరాస్తుల విక్రయంపైనే దృష్టి

మదర్ డెయిరీకి ఉన్న అప్పులను తీర్చేందుకు ప్రభుత్వం నుంచి ప్రస్తుతం పాలకవర్గం ప్రత్యేక గ్రాంట్ మంజూరుకోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. అయితే కోఆపరేటివ్ చట్టం ప్రకారం మదర్ డెయిరీ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడం సాధ్యమవుతుందా? అనే అంశం పరిశీలించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించేందుకు స్థిరాస్తులు విక్రయించేందుకు పాలకవర్గం మొగ్గు చూపుతోంది. ఈమేరకు పాలకవర్గం సర్వసభ్య సమావేశంలో తీర్మానం కూడా చేసింది. డెయిరీ ఆస్తులను బ్యాంకులు జప్తు చేసిన పక్షంలో తక్కువ ధరకు ఆస్తులు విక్రయాలు జరుగుతాయని, మదర్ డెయిరీ పాలకవర్గం ఆధ్వర్యంలో బహిరంగ మార్కెట్‌లో వేలం వేసిన పక్షంలో అధిక ధర వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. అందుకు 10 మందితో కమిటీని నియమించింది. చిట్యాల, మిర్యాలగూడ, తదితర ఆస్తులు విక్రయించడం ద్వారా సంస్థకు రూ.55కోట్ల మేరకు వచ్చే అవకాశం ఉందని అంచనా. తద్వారా వివిధ బ్యాంకుల్లో మదర్ డెయిరీకి చెందిన అప్పులు తీర్చడంతోపాటు రైతులకు సకాలంలో పాల బిల్లులు చెల్లించవచ్చని పాలకవర్గం భావిస్తోంది.

నేతల మాటలు నీటిమూటలేనా?

నార్మూల్‌ను అప్పుల ఊబి నుంచి తప్పించి, లాభాల బాట పట్టిస్తామని పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, పాలకవర్గంలోని అధికారపక్షం నేతలు వెల్లడించారు. నార్మూల్ పాలకవర్గం ఎన్నికల సమయంలోనూ రైతులకు అనేక వాగ్దానాలు ఇచ్చింది. ప్రభుత్వం నుంచి తక్షణం సహాయం కోసం జిల్లాలోని ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలను విన్నవించి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తామని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ప్రస్తుత చైర్మన్ గడిపాటి మధుసూదన్‌రెడ్డి, పలువురు డైరెక్టర్లు హామీ ఇచ్చారు. అయితే ఇప్పటివరకు రైతులకు ఇచ్చిన ఒక్క హామీ నెరవేరకపోగా... రైతులకు చెల్లించాల్సిన బిల్లులకోసం నెలల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి మదర్‌డెయిరీకి ప్రత్యేకంగా గ్రాంట్‌ను మంజూరు చేయించేందుకు పాలకవర్గం కసరత్తు చేస్తోందని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో పాటు ప్రస్తుత నార్మూల్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి ప్రకటించి, రైతులను మోసం చేశారని, ఇప్పటివరకు ప్రభుత్వంతో చర్చించి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయించలేదని ప్రతిపక్ష పార్టీకి చెందిన డైరెక్టర్లు విమర్శలు గుప్పిస్తున్నారు.

భగ్గుమన్న పాడి రైతులు

పాల బిల్లులు చెల్లించకపోవడంతో పాడి రైతులు భగ్గుమంటున్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో పాడి రైతులు నార్మూల్ పాలకవర్గంపై కన్నెర్ర చేస్తున్నారు. ఎన్ని పాలకవర్గాలు మారినా, రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించడంలేదని పెద్దఎత్తున నిరసనలకు దిగుతున్నారు. రైతులకు చెల్లించాల్సిన పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించాలని డిమాండ్‌చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలోని పాల శీతలకరణ కేంద్రం ఎదుట ఇటీవల పాడి రైతులు బైఠాయించారు. రోడ్డుపై పాలను కాచి నిరసన తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లించే వరకూ ఉద్యమిస్తామని, ప్రతినెలా బిల్లులు చెల్లించేలా తగిన చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



బండారి ప్రభుదాసు(ఫైల్)

నాగారం, నవంబరు 23,(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నాగారం మండల పరిధిలోని నాగారం బంగ్లా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. నాగారం సీఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... వర్ధమానుకోట గ్రామానికి చెందిన పాస్టర్ బండారి ప్రభుదాసు(65) అర్వపల్లి వెళ్లడానికి నాగారం బంగ్లా స్టేజీ ఆటో వద్ద ఎక్కాడు. ఆటో నాగారం బంగ్లా స్టేజీ దాటి అర కిలోమీటరు దూరం రాగానే ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో సూర్యాపేట వైపు వెళ్తున్న జేసీబీని ఆటో డ్రైవర్ దాటే క్రమంలో జేసీబీ వెనుక ఉన్న బొక్కెన ఆటోకు తగిలింది. దీంతో ఆటో ఉన్న బండారి ప్రభుదాసు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రభుదాసుకు భార్య, నలుగురు కూమార్తెలు ఉన్నారు. నాగారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రభుదాస్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



బద్య మృతదేహం

తిరుమలగిరి: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిసిపల్ పరిధిలోని నెల్లిబండతండాకు చెందిన ఆంగొ తు బద్య(50) తన పొలంలో వ్యవసాయం చేస్తూ, కూరగాయలు పండిస్తుంటాడు. తన చేనులో పండిన వివిధ రకాల కూరగాయలను రోజూ తిరుమలగిరిలో విక్రయించడానికి వస్తుంటాడు. రోజూ మాదిరిగా కూరగాయలు విక్రయించి బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తుండగా, రోడ్డు దాటుతున్న క్రమంలో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో, అక్కడికక్కడే మృతి చెందాడు. బద్యకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు ఆంగోతు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానంతో అంతమొందించాడు

● ప్రియురాలిని గొంతు నులిమి చంపిన వైనం ● గరిడేపల్లి మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

హుజూర్‌నగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన మహిళా కేసును పోలీసులు ఛేదించారు. హుజూర్‌నగర్ పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ చరమందరాజు కేసు వివరాలు వెల్లడించారు. గరిడేపల్లి మండలం గానుగబండకు చెందిన షేక్. సైదాహుస్సేన్, సైదాబీ భార్యభర్తలు, కాగా వారికి ఇద్దరు కుమారైలు ఉన్నారు. అదే గ్రామానికి చెందిన పాలేల్లి హుస్సేన్‌తో సైదాబీ వివాహేతర సంబంధం పెట్టుకుంది. సైదాబీ గ్రామస్థులతో కలిసి బచ్చన్నపేట గ్రామానికి వరినాట్లు వేసేందుకు వెళ్లేది. ఆమెతో పాటు పాలేల్లి హుస్సేన్ కూడా వెళ్లేవాడు. దీంతో సైదాబీతో పరిచయం పెంచుకున్నాడు. కాగా ఇద్దరి మధ్య పరిచయం పెరిగి వివాహేతర సంబంధానికి దారి తీసింది. పాలేల్లి హుస్సేన్, సైదాబీ గానుగబండ గ్రామంలోని పోకల వెంకటేశ్వర్లుకు చెందిన పాకలో కలిసేవారు. ఇటీవల సైదాబీ వేరే వ్యక్తులతో మాట్లాడుతోందని ప్రియుడు అనుమానం పెంచుకున్నాడు. పదే పదే ఫోన్లు చేసి రమ్మని వేధించేవాడు. ఎలాగైనా సైదాబీని చంపాలని నిర్ణయించుకున్నాడు. ఎప్పుడూ కలుసుకునే ప్రదేశానికి రావాలని హుస్సేన్ ఈ నెల 19న మద్యం సేవించి బైక్‌పై పాక వద్దకు వెళ్లాడు. కాగా సైదాబీ, హుస్సేన్ మాట్లాడుకుంటుండగా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో సైదాబీని హుస్సేన్ గొంతు నులిమి చంపేశాడు. ఈ విషయం తన గ్రామానికి చెందిన సైదమ్మకు చెప్పి పారిపోయాడు. ఆ విషయం ఎవరికీ తెలియనందున తన భార్య మృతికి అదే గ్రామానికి చెందిన పాలేల్లి హుస్సేన్‌పై అనుమానం ఉందని సైదాబీ భర్త సైదాహుస్సేన్ ఈనెల 20న గరిడేపల్లి పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కేసు నమోదు చేసి విచారించారు. దీంతో పాల్లేలి హుస్సేన్‌ను పట్టుకొని విచారించి కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. నిందుతుడి సెల్‌ఫోన్, సైదాబీ సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ చలికంటి నరేష్ పాల్గొన్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

ఆశయాలు సాధించాలి

ఆలేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించిన సీపీఐ(ఎంఎల్) న్యూ డెమెక్రసీ నేత ధర్మ విఠల్‌రెడ్డి ఆశయాలు సాధించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జన్నె మల్లేష్ కోరారు. ఆదివారం కొలనుపాకకు చెందిన మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి వర్ధంతిని ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. నేడు భౌతికంగా లేకపోయినా పేద ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపేట చంద్రయ్య, వస్పరి బాలమల్లేష్, అంజయ్య, వరలక్ష్మి, రవి, కోల అనిత, శ్రవణ్, బాలయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



విఠల్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బాలికపై కుక్కల దాడి

ఆత్మకూర్(ఎస్), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని కందగట్ల గ్రామంలో ఆదివారం పిచ్చికుక్కలు స్వైరవిహారం చేశాయి. వీధి ఆడుకుంటున్న ఆరేళ్ల పాపపై దాడి చేసి గాయపరిచాయి. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో నెమ్మికల్ నుంచి కందగట్ల అమ్మమ్మ ఇంటికి వెళ్లిన ఆరేళ్ల పాప తపస్వి ఇంటి ముందు ఉన్న పీర్లకొట్టం వద్ద ఆడుకుంటుండగా రెండు పిచ్చి కుక్కలు వచ్చి దాడి చేసి గాయపరిచాయి. సమీపంలో ఉన్న స్థానికులు వెంటపడడంతో అవి పారిపోయాయి. గాయపడిన మనరాలిని చికిత్స నిమిత్తం తాత విష్ణుమూర్తి స్థానిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

డీఎస్పీగా శ్రీనివాస్‌రావు బాధ్యతల స్వీకరణ



దేవరకొండ, నవంబరు 23(ఆధ్రజ్యోతి): దేవరకొండ డీఎస్పీగా ఎంవీ. శ్రీనివాస్‌రావు ఆదివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. దేవరకొండ ఏఎస్పీగా పని చేసిన మౌనిక ఆదిలాబాద్ ఏఎస్పీగా బదిలీ అయ్యారు. మల్కాజ్‌గిరి ట్రాఫిక్ ఏసీపీగా పనిచేస్తున్న ఎంవీ. శ్రీనివాస్‌రావును దేవరకొండ డీఎస్పీగా బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిన్నారుల ప్రతిభ

పెద్దవూర, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చలకుర్తి గ్రామానికి చెందిన పాతనబోయిన సంతోష్‌కుమార్, ప్రియాంక కుమార్తె పాతనబోయిన సుదీక్ష, కుమారుడు పాతనబోయిన విహాస్ పాల్గొన్నారు. తెలంగాణాకు చెందిన పలువురు మార్షల్ ఆర్ట్స్ (కరాటే, తైక్వాండ్, కుంగ్‌ఫూ) క్రీడాకారులు పాల్గొన్నారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సాధించడం సంతోషంగా ఉందని చిన్నారులు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ మహేష్‌నాయక్ మాస్టర్, శివ మాస్టర్, మహేష్ మాస్టర్ పాల్గొన్నారు.

విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు సరికాదు

అడ్డగూడూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరటం చేస్తున్న విద్యార్థి సంఘట నాయకులపై కేసు నమోదు చేయడం సరికాదని ఏఐఎస్ఎఫ్ యాదాద్రిభువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమారి అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉప్పల ఉదయ్ కుమార్ అక్రమ అరెస్టును ఖండిస్తూ మండల కేంద్రంలో ఆదివారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. విద్యార్థి సంఘం నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

24 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

నాగారం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. నాగారం సీఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మండలంలోని పేరబోయినగూడెం బిక్కేరువాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా 24 ట్రాక్టర్ల ఇసుకను నింపుకుని నాగారం నుంచి తుంగతుర్తి వైపు వెళుతుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. సోమవారం నాగారం తహసీల్దార్ ఎదుట ఇసుక ట్రాక్టర్ యాజమానులను బైండోవర్ చేయనున్నట్లు తెలిపారు.

లాడ్జీలపై పోలీసుల దాడులు

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 23,(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మునిసిపాలిటీ పరిధిలోని పాతగుట్ట, పట్టణంలోని పలు లాడ్జీలపై స్థానిక సీఐ. బొడ్డుపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో మెరుపు దాడులు చేశారు. లాడ్జీల్లోని రికార్డులను పరిశీలించారు. లాడ్జి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుకున్నారు. నియమాలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ బొడ్డుపల్లి భాస్కర్, ఎస్ఐలు సైదులు, రూపశ్రీ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌తో తొక్కించి చంపే ప్రయత్నం

● చేబదులు డబ్బులు తిరిగివ్వాలంటూ తమ్ముడి దౌర్జన్యం ● సహకరించిన తల్లి ● ప్రతిదాడికి దిగిన సోదరి కుటుంబం ● సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో ఘటన



వరి కోత యంత్రాన్ని ట్రాక్టర్‌తో ఢీకొట్టి డ్రైవర్‌పై దాడి చేస్తున్న ఉపేందర్‌రెడ్డి

మునగాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చేబదులుగా ఇచ్చిన డబ్బుల విషయంలో అక్కాబావతో పాటు మేనకోడళ్లపై ట్రాక్టర్‌తో ఓ వ్యక్తి హత్యాయత్నం చేశాడు. ఇందుకు తల్లి సహకరించింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం బరాఖత్‌గూడెంలో జరిగింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..

మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన దొంతిరెడ్డి కళావతి, సుధాకర్‌రెడ్డి దంపతులకు కుమార్తె, కుమారుడు. నాలుగేళ్ల కిందట సుధాకర్‌రెడ్డి మృతి చెందాడు. 25ఏళ్ల కిందట మునగాల మండలం నర్సింహులగూడెం గ్రామానికి చెందిన రెబబోతు రాంరెడ్డితో వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు. ప్రస్తుతం జ్యోతి దంపతులు కోదాడలో ఉంటున్నారు. ఆమె పెళ్లి సమయంలో బరాఖత్ గూడెంలో తమకు చెందిన కొంత భూమిని జ్యోతికి రాసివ్వగా, మరికొంత భూమిని జ్యోతి కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆ భూమిని సాగు కోసం జ్యోతి కౌలుకు ఇచ్చింది. ఇదిలా ఉండగా ఆమె తమ్ముడు దొంతరెడ్డి ఉపేందర్‌రెడ్డి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా తిరువూరులో బీఎస్ఎన్ఎల్‌లో జేఈగా ఉద్యోగం చేస్తున్నారు. జ్యోతి కుమార్తె పెళ్లికి కళావతి చేబదులుగా బంగారం, డబ్బు సాయం చేసింది. అయితే అవి తిరిగి ఇవ్వాలని రెండేళ్లుగా జ్యోతితో తల్లి కళావతి, తమ్ముడు ఉపేందర్‌రెడ్డి గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో మూడు నెలల కిందట కోదాడలో పెద్దమనుషుల మధ్య జరిగిన పంచాయితీలో డబ్బులు తిరిగి ఇచ్చేలా అంగీకారం కుదిరింది. ఆ మేరకు జ్యోతి డబ్బులు తిరిగి ఇచ్చేంది.

ఇంకా నగదు ఇవ్వాలని వివాదం

ఒప్పందం మేరకు డబ్బులు ఇచ్చినప్పటికీ ఇంకా రూ. 2లక్షల వరకు రావాలంటూ తల్లి కళావతి, తమ్ముడు ఉపేందర్‌రెడ్డి సోదరి జ్యోతిని వేధిస్తున్నారు. ఈ క్రమంలో డబ్బులు ఇచ్చే వరకూ పొలంలో వరికోతలు కోయనివ్వమంటూ ఆదివారం కౌలు రైతును కళావతి, ఉపేందర్‌రెడ్డి కలిసి హెచ్చరించారు. ఈ విషయాన్ని కౌలు రైతు జ్యోతికి తెలియజేయడంతో ఆమె తన భర్త రాంరెడ్డి, కుమార్తెలతో కలిసి పొలం వద్దకు వచ్చింది. ఆ సమయంలో తల్లి కళావతి, ఉపేందర్‌రెడ్డి అక్కడ లేరు. దీంతో దగ్గరుండి యంత్రంతో వరి కోతలు కోయిస్తోంది. విషయం తెలుసుకున్న కళావతి, ఉపేందర్‌రెడ్డిలు ట్రాక్టర్‌పై పొలం వద్దకు వస్తూనే వరి కోత యంత్రాన్ని ఢీకొట్టారు. అనంతరం అడ్డుకోబోయిన జ్యోతి, రాంరెడ్డి, ఆమె కుమార్తెలపైకి ట్రాక్టర్ తీసుకెళ్తుండగా వారు పరుగులు తీశారు. ట్రాక్టర్ దిగిన ఇద్దరు వరి కోత యంత్రం డ్రైవర్‌పై దాడి చేశారు. అడ్డుకునేందుకు వచ్చిన జ్యోతి, రాంరెడ్డి, వారి కుమార్తెలపై దాడి చేశారు. చుట్టుపక్కల రైతులు వచ్చి వారిని కాపాడారు. ప్రతిదాడిలో కళావతికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు జ్యోతి, రాంరెడ్డి, ఆమె కుమార్తెలను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జ్యోతి ఫిర్యాదు మేరకు ఆమె తల్లి కళావతి, ఉపేందర్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



గొడవపడుతున్న ఉపేందర్‌రెడ్డి, తల్లి కళావతి(వీపుభాగం కనిపిస్తున్న మహిళ), ఆమె కింద కుమార్తె జ్యోతి

శంకుస్థాపన.. ఇలా కానిచ్చేశారు



సాధారణంగా శిలాఫలకం నిర్మించి, బండపై ప్రజా ప్రతినిధులు, అధికారుల పేర్లు రాస్తారు. కానీ యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వడాయిగూడెం, జమ్మపూరం గ్రామాలలో హడవిడిగా హెచ్ఎమ్‌డీఏ నిధులతో సీసీరోడ్డు, అండర్ డ్రైయినేజీ, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కర్రలకు శిలాఫలకం మాదిరిగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి శంకుస్థాన కానిచ్చేశారు.
● ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి

పొంచిఉన్న ప్రమాదం..



యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి లారీల్లో తరలిస్తున్న ధాన్యం బస్తాల లోడ్ ఎక్కువ ఎత్తు వేయిస్తున్నారు. కొనుగోలు కేంద్రం నుంచి భువనగిరి మెయిన్ రోడ్డుకు వెళ్లే దారిలో ఉన్న పక్కన 11కేవీ విద్యుత్ వైర్లకు లారీల నిండా ఉన్న బస్తాలకు విద్యుత్ వైర్లు తగులుతూ ధాన్యం రవాణా జరుగుతుంది. ప్రమాదమని తెలిసినా ధాన్యం బస్తాల లోడ్‌లను తగ్గించడం లేదు. ధాన్యం రవాణా సమయంలో విద్యుత్ అధికారులు ఈ ప్రదేశంలో జాగ్రత్త చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పేర్కొంటున్నారు.
● ఆంధ్రజ్యోతి, బొమ్మలరామారం

పాత బావులు.. ప్రమాదాలకు నెలవు



నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం, వెంకటాపురం, కోయిగూరోనిబావి రోడ్ల వెంట బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. బావులకు రక్షణగోడలు లేవు. వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించకపోతే పక్కనే ఉన్న బావుల్లో పడే అవకాశముంది. గతంలో ఉపాధిహామీ నిధులతో రోడ్డు పక్కన బావులు గుర్తించి పూడ్చేవారు, లేదా వినియోగంలో బావి ఉన్న చోట సైడ్‌వాల్ నిర్మించేవారు. పిట్టలగూడెం వద్ద రోడ్డు పక్కన మూల మలుపులో బావి ఉండడంతో బస్సులు తిరిగే ఈ దారిలో ప్రమాదం పొంచిఉంది.
● ఆంధ్రజ్యోతి, గుర్రంపోడు

జీవితం.. చేజారితే తిరిగి రాదు



'జీవితం చేజారితే తిరిగిరాదు.. యువత డ్రగ్స్, గంజాయి బారిన పడి జీవితాలు నశనం చేసుకోవద్దు' అని సామాజిక కార్యకర్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. గంజాయి, డ్రగ్స్ వాడితే జరిగే అనర్థాలను యమధర్మరాజు వేషధరణలో వివరిస్తూ సూర్యాపేట జిల్లా అర్వపల్లి, మద్దిరాల, తుంగతుర్తి మండలం కొత్తగూడెం టోల్‌గేట్ వద్ద ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నో డ్రగ్స్. సేవ్‌లైఫ్ అని అవగాహన కల్పించారు.
● అర్వపల్లి, తుంగతుర్తి, మద్దిరాల ఆంధ్రజ్యోతి.

వలస కూలీల తాత్కాలిక గూడు



గ్రామాల్లో పత్తి ఏరడానికి, వరినాట్లు వేయడానికి, కలుపు తీయడానికి సూర్యాపేట, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి పొట్ట చేతపట్టుకొని వచ్చిన దినసరి కూలీలు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని మాంద్ర గ్రామ శివారులో తత్కాలిక గుడిసెలు వేసుకున్నారు. ఇక్కడ పని అయిపోయిన తర్వాత వేరే గ్రామానికి వెళ్తుంటారు.
● ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి.

శుభకార్యాలకు విరామం

● శుక్ర మౌఢ్యమి కారణం ● మూడు మాసాల తర్వాతే ముహూర్తాలు ● మాఘమాసం వచ్చే దాక..

గ్రహాల స్థితిని బట్టి మౌఢ్యమి(మూఢాలు) వస్తుంది. మౌఢ్యమి కాలంలో వివాహాది శుభకార్యాలు నిర్వహించరు. ఈ సారి సుమారు మూడు మాసాలు శుభ మూహూర్తాలకు విరామం రానుంది. ఈ నెల 26 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు (శ్రీ విశ్వావసు నామ సంవత్సరం మార్గశిర శుద్ధ షష్టి నుంచి మాఘ బహుళ అమావాస్య వరకు) శుక్రమౌఢ్యమి ఉంటుంది. దీంతో సుమారు మూడు మాసాల పాటు శుభకార్యాలకు విరామం ఉండనుంది.

● ఆంధ్రజ్యోతి, మోత్కూరు



వివాహాలకు మంచి ముహూర్తాలు వర్షాకాలంలో వ్యవసాయ పనులు ఎక్కువగా ఉండడం, వర్షాలు కురిస్తే పనులకు, రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వివాహాలు ఎక్కువగా జరుగవు. వేసవిలో ఎండలు, ఉక్కపోత భరించలేమని అప్పుడూ ఎక్కువగా వివాహాలు చేయడానికి విముఖత చూపుతుంటారు. మార్గశిర, మాఘ మాసాల్లోనే వివాహాలు ఎక్కువగా జరుగుతాయి. ఈ మాసాల్లోనే ఎక్కువ మంచి ముహూర్తాలు ఉంటాయి. ఈ సారి మార్గశిరంలో ఒకట్రెండు ముహూర్తాలే ఉండగా పుష్య మాసం శూన్య మాసమవుతుంది. శుక్ర మౌఢ్యమి కారణంగా మాఘ మాసంలో ఒక్క ముహూర్తం కూడా లేదు. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి, మహా మాఘీగా పిలువబడే మాఘ పౌర్ణమి వంటి మంచి తిథులు కూడా ఈ సారి మూఢంలోనే కలిసిపోతున్నాయి.

మౌఢ్యమి(మూఢం) అంటే..

జ్యోతి శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాల్లో కనుమరుగై పోవడాన్ని మూఢం అంటారు. గ్రహ శక్తులు బలహీన పడటంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలించవంటారు. శుభ కార్యాలకు గురు బలం ఎంత ముఖ్యమో శుక్ర బలం కూడా అంతే ముఖ్యమంటారు. శుక్రుడు బలహీన పడితే అనుబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక అంశాల్లో ప్రతికూలత చూపుతుందని జ్యోతిష్యులు చెబుతారు. అందుకే శుక్ర మౌఢ్యమి ఉన్న కాలంలో ఎలాంటి శుభ కార్యాలూ జరపరని చెబుతారు.

ఈ శుభ కార్యాలు చేయవద్దంటారు

శుక్ర మౌఢ్యమిలో వివాహాలు జరుపడం, పెళ్లి చూపులు, పుట్టు వెంట్రుకలు తీయడం, నూతన గృహ నిర్మాణాలకు భూమిపూజ చేయడం, నూతన గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠ, కొత్త వాహనాలు కొనడం, బోరు, బావులు తవ్వించడం, నూతన వ్యాపారాలు ప్రారంభించడం చేయకూడదంటారు.

వ్యాపారాలపై ప్రభావం

శుభకార్యాలు లేకుంటే ఫంక్షన్‌హాళ్లు, వస్త్ర, నగల దుకాణాల యజమానులు, క్యాటరింగ్, డెకరేషన్, ఫొటో, వీడియో గ్రాఫర్లు, టెంట్ హౌస్‌లు, పూల దుకాణాలు, లైటింగ్, డీజే, సన్నాయి, ఆర్కెస్ట్రా, అద్దె కార్లు, బస్సులు, తదితర వ్యాపారులు, వంట మాస్టర్లు, వర్కర్లు, చివరకు పురోహితులు నెలల తరబడి రాబడి లేక నష్టపోతారు.

ముహూర్తాలు లేవు



శుక్ర మౌఢ్యమి కారణంగా ఈ నెల 26 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు సుమారు మూడు మాసాలు శుభ కార్యాలకు మంచి రోజులు లేవు. వివాహాలతో పాటు గృహ ప్రవేశాలు, విగ్రహప్రతిష్ఠలు, వరపూజలు లాంటి శుభ కార్యాలేవి చేసుకోకూడదు. ఈ మూడు మాసాలు పలు రంగాల వారికి కొంత గడ్డు కాలమే అయినా భరించక తప్పదు.
● పారునంది సూరిబాబు శర్మ, పురోహితుడు, మోత్కూరు, యాదాద్రిభువనగిరి జిల్లా.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	583.70 అడుగులు
ఎడమకాల్వకు నీటి విడుదల	4034 క్యూసెక్కులు
కుడికాల్వకు	9019క్యూసెక్కులు
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
సాగర్‌కు నీటి రాక	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	15,634 క్యూసెక్కులు
మొత్తం గేట్లు	నిల్

- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.88 టీఎంసీలు
నీటి రాక	1000 క్యూసెక్కులు
నీటి విడుదల	8000 క్యూసెక్కులు

- చింతలపాలెం

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	644 అడుగులు
నీటి రాక	911.02 క్యూసెక్కులు
నీటి విడుదల	911.02 క్యూసెక్కులు

- కేతేపల్లి

శాలిగౌరారం ప్రాజెక్ట్

పూర్తిస్థాయి నీటి మట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	20 అడుగులు
నీటి రాక	నిల్
నీటి విడుదల	నిల్

-శాలిగౌరారం

పీవీ, మద్ది ఆలోచనల ప్రతిరూపమే సర్వేల్ గురుకులం

● ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు ● సర్వేల్ గురుకులంలో పీవీ, మద్ది విగ్రహాల ఆవిష్కరణ



గురుకుల పాఠశాలలో పీవీ విగ్రహ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రామకృష్ణారావు, పక్కన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆలోచనల ప్రతిరూపం, మద్ది నారాయణరెడ్డి చేయూతే గురుకుల పాఠశాలల ఏర్పాటుకు మూల కారణమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సర్వేల్ గురుకుల పాఠశాల ప్రారంభించి 54 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా గురుకుల పాఠశాల ఏర్పాటుకు స్ఫూర్తి నిలిచిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, భూదాత మద్ది నారాయణరెడ్డి విగ్రహాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదివారం ఆవిష్కరించారు. ముందుగా పాఠశాలకు విచ్చేసిన ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ఎన్‌సీసీ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల సౌలభ్యం కోసం అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న పీవీ నరసింహారావు గురుకుల పాఠశాలల ఏర్పాటుకు నాంది పలికారని ఆయన అన్నారు తాను కూడా సర్వేల్ గురుకుల పాఠశాలలో చదువుకొని ఈ స్థాయికి వచ్చానన్నారు. తాము చదివిన సమయంలో పాఠశాలలో ఈ స్థాయిలో సౌకర్యాలు ఉండేవి కావని ఇప్పుడు ప్రభుత్వంతో పాటు ప్రజా ప్రతినిధులు, అలూమినీ అసోసియేషన్ వారు అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు చేయూత అందిస్తానని రామకృష్ణారావు హామీ ఇచ్చారు.

విద్యతోపాటు క్రమశిక్షణ అవసరం : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువుతోపాటు క్రమశిక్షణ, శారీరక దృఢత్వం అవసరమని ఆయన అన్నారు, చదువుకున్న రోజుల్లో తరగతి గదులు సరిగా ఉండేవి కావని చెట్ల కిందనే చదువుకునే వాళ్లమని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం చదివే బాధ్యత మీ పైనే ఉందని ఆయన అన్నారు. సర్వేల గురుకులంలో సుమారు రూ. 20 కోట్ల వెచ్చించి భవనం నిర్మించినా ఫర్నిచర్‌లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను చూసి రూ.కోటితో ఫర్నిచర్ సమకూర్చినట్లు ఆయన తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి గురుకుల పాఠశాల సర్వేల్‌లో ఉండడం మన నియోజకవర్గానికి గర్వకారణం అని ఆయన వివరించారు

విద్యాభివృద్ధికి పీవీ సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం, గురుకుల పాఠశాలల ఏర్పాటు కోసం దివంగత పీవీ నరసింహారావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఆమె అన్నారు. సర్వేలు గురుకుల పాఠశాల స్ఫూర్తితోనే నవోదయ పాఠశాలలు ఏర్పాటు అయ్యాయని ఆమె తెలిపారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తనయుడు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ దేశంలో ఆధునిక గురుకుల పాఠశాలల ఏర్పాటుకు నవోదయ పాఠశాలల ఏర్పాటుకు సర్వే గురుకులమే దిక్సూచిగా నిలుస్తుందన్నారు. అలూమిని అసోసియేషన్ అధ్యక్షుడు బూడిద నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తమ అసోసియేషన్ ద్వారా పాఠశాలలో విదార్థుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అలూమినీ అసోసియేషన్ ప్రతినిధి గుర్రం మల్సూర్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలకు దీటుగా గురుకుల పాఠశాలలు నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, గురుకుల విద్యాలయ సంస్థల కార్యదర్శి రమణకుమార్, మద్ది నారాయణరెడ్డి మనవడు మద్ది మాధవరెడ్డి, డీఈవో సత్యనారాయణ, ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, సతీష్‌కుమార్, అసోసియేషన్ ప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, మల్లేశం, గంగాధర్, కేసీవీ వెంకటనర్సయ్య, ఆచారి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వేల్ గురుకుల పాఠశాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌ను ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ప్రారంభించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రామకృష్ణారావు ఎమ్మెల్యే సన్మానించారు

శాస్త్రోక్తంగా లక్ష్మీనృసింహుడికి నిత్య పూజలు

● నిత్యాదాయం రూ. 50.49 లక్షలు



ప్రాకార మండపంలో నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మ మేల్కొపిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టా రు. పాతగుట్టలోనూ స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు ఘ నం గా చేపట్టారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

సుమారు 46 వేల మంది భక్తుల రాక

స్వామి వారి దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి సొంత వాహనాల్లో తరలివచ్చిన భక్తులతో కొండపైన పార్కింగ్ ప్రదేశాలు నిండిపోయి ంది. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాలు, మధ్యాహ్నం (ఆరగింపు) కలిపి మూడు గంటల పాటు భక్తులు క్యూలైన్లల్లో వేచి ఉన్నారు. సుమారు 46 వేల మంది భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శనానికి రాగా ప్రత్యేక దర్శనం అర్ధగంట, ధర్మదర్శనం గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు.



గర్భాలయంలో ఉభయ క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి నెలకొంది. బ్యాటరీ వాహనాల ద్వారా చంటి పిల్లల తల్లులు, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులను లిఫ్ట్ ద్వారా తూర్పు తిరువీధికి తరలించారు. కొండపైకి వెళ్లడానికి భక్తుల కోసం తగినన్నీ బస్సులు ఏర్పాటు చేసినప్పటికీ ఎదురుచూపులు తప్పలేదు. ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటోలకు పోటీ పడారు. అధిక సంఖ్యలో సత్యదేవుని వ్రతాలు జరిపించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 50,49,359 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, ప్రతి వారం నిర్వహించే సంగీత సభల్లో భాగంగా శ్రీనృత్య (హైదరాబాద్) అకాడమీ కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు.

వైభవంగా లక్ష్మీనృసింహుడి కల్యాణం

మఠంపల్లి, : మట్టపల్లి లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రాతఃకాలార్చనలు అనంతరం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉపాలయాల్లో పరివార దేవతలకు ప్రాబో ది నివేదనలు సమర్పించాక క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన నిర్వహించారు.. మధ్యాహ్నం 11 గంటలకు రాజ్యలక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మహార్నివేదనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెనూ ్నరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సరికొండ నవీన్ ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చి గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక చేశారు. ఈనెల 27వ తేదీ నుంచి సంగారెడ్డి లో నిర్వహించనున్న రాష్ట్ర సీనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లాకు ఎంపికైన జట్టు ప్రాతినిధ్యం వహించనుంది. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్‌ఖాన్, రామ్‌ప్రతాప్, దత్తాత్రేయ, సమయుద్దీన్, రమేష్, నజీర్, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకుల కోసం పిల్లలపై ఒత్తిడి తేవొద్దు

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

● అట్టహాసంగా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : ర్యాంకుల కోసం తల్లిదండ్రులు తమ పిల్లలపై తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో 69వ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాలుర, బాలికల అండర్ -17 ఖో ఖో క్రీడలను ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల ఖో ఖో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల విషయంలో తల్లిదండ్రుల ధోరణి మారాలన్నారు. ర్యాంకుల కోసమే కాకుండా తమ పిల్లలను క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఆటలు ఆడాలని తద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు తన వంతు సహకరిస్తారనన్నారు. కార్యక్రమంలో డీఈవో కం దుల సత్యనారాయణ, ఎంఈవో గురవారావు, ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ దశరథ రెడ్డి, వాసం నవీన్, పులి కిశోర్, సత్యనారాయణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో నల్లగొండ వాసి ప్రతిభ



ముక్సిత్‌ను అభినందిస్తున్న కోచ్

నల్లగొండ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ రాష్ట్రం జలంధర్ ఆర్మ్‌డ్ పోలీస్ స్టేడియంలో నిర్వహించిన 8వ జాతీయ తైక్వాండో పోటీల్లో నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన అబ్దుల్ ముక్సిత్ కాంస్య పతకాన్ని సాధించాడు. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 21నుంచి 23వరకు తైక్వాండో జాతీయ స్థాయి పోటీలు జరిగాయి. చివరి రోజున రాష్ట్రం నుంచి వెళ్లిన ముక్సిత్ పోటీల్లో కాంస్య పతకం అందుకున్నాడు. ముక్సిత్‌ను కోచ్ ఎండీ యూనస్ కమాల్, తండ్రి ఇలియాజ్‌పాషా అభినందించారు.

తైక్వాండో పోటీల్లో గోల్డ్ మెడల్



మహారాజ్‌కు గోల్డ్ మెడల్‌ను అందజేస్తున్న కోచ్

భువనగిరి రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : భువనగిరి పట్టణానికి చెందిన కొలుపుల మహారాజ్ జిల్లా స్థాయి తైక్వాండో, కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్‌ను సాధించారు. స్థానిక న్యూడైమెన్షన్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో జిల్లా స్థాయి గోల్డ్ మెడల్‌ను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. పరమేశ్, ప్రదాన కార్యదర్శి గుర్రం కృష్ణ అందజేశారు. కరస్పాండెంట్ పులిమామిడి సుభాష్ రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ కొలుపుల కమలాకర్, ప్రిన్సిపల్ రూపాణి మహారాజ్‌ను అభినందించారు.

జాతీయ స్థాయి సదస్సుకు కొండమల్లేపల్లి వాసి

కొండమల్లేపల్లి, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన జెండర్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు చిలువేరు ధనమ్మ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెర్ప్, డీఆర్డీఏ సంయుక్తంగా ఈనెల 25న ఢిల్లీలో నైచేతన పేరుతో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సులో పాల్గొననుంది. ఈ మేరకు ఆదివారం అధికారులు సమాచారం అందించినట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి ఐదుగురు మహిళలు వెళ్తుండగా అందులో నల్లగొండ జిల్లా నుంచి తాను ఎంపికైనట్లు ధనమ్మ తెలిపారు. 20 ఏళ్లుగా జిల్లా జెండర్ కమిటి అధ్యక్షురాలిగా ఉంటూ మహిళా సాధికారతకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల బలోపేతం చేయడం, భార్యాభర్తల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించడం, బాల్య వివాహాలను ఆపడం, శిశు విక్రయాలను అరికట్టడంలో తన వంతుగా కృషి చేస్తోంది.

సూర్యాపేట
కోదాడ-హుజూర్‌నగర్-తుంగతుర్తి

ఘనంగా ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం



నేరేడుచర్లలో ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న క్యాడెట్లు

నేరేడుచర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం మునిసిపాలిటీ పరిధిలోని రామాపురం బాలుర గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం చైతన్య ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీటీవో గోపాలరావు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

చిలుకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేటలో ఈ నెల 28 వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని బేతవోలు గ్రామంలో మహాసభల పోస్టర్లను సంఘం సభ్యులతో కలిసి ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు, సోమయ్య, గురవయ్య, ఉపేందర్, రాములు, లక్ష్మయ్య, వెంకయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడు నర్సయ్యకు సన్మానం



గుడిపాటి నర్సయ్యను సన్మానిస్తున్న నాయకులు

సూర్యాపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్యను ఆదివారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌజ్‌లో కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా నర్సయ్యకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అంజద్‌అలీ, ఎలిమినేటి అభినయ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

అర్వపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మూసీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నాగారం సీఐ నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం అర్వపల్లి తహసీల్దార్ కార్యాలయంలో 'మన ఊరు.. మన ఇసుక' వాహనదారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బుక్ చేసుకున్న వెంటనే లబ్ధిదారులకు ఇసుకను మన ఇసుక వాహనదారులు అందజేయాలన్నారు. 'మన ఊరు.. మన ఇసుక' వాహనాలకు ఓటీపీలు రాలేదని సాకులు చెప్పవద్దని అన్నారు. సమావేశంలో ఎస్‌ఐ సైదులు, డీటీ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలోత్సవ్‌లో 'జయ' విద్యార్థుల ప్రతిభ

కోదాడ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బజ్జూరి నర్సిరెడ్డి స్మారకార్థం కోదాడలో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగిన బాలోత్సవ్‌లో 2025-26వ జయ పాఠశాల, కోదాడ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ జయవేణుగోపాల్ ఆదివారం తెలిపారు. క్విజ్ పోటీల్లో ప్రథమ, సోలో డాన్స్‌లో ద్వితీయ, చిత్ర లేఖనంలో తృతీయ బహుమతి సాధించారన్నారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్. డైరెక్టర్లు బింగి జ్యోతి జెల్లా పద్మ, హెచ్‌ఎం చిలువేరు వేణు అభినందించారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా యాదగిరి

తిరుమలగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ఉపాధక్షుడిగా తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన మేడబోయిన యాదగిరి, మీడియా కన్వీనర్‌లుగా ఎల్సోజు దీన్‌దయాల్ ఎన్నికయ్యారు. ఈ ఇద్దరి పేర్లను బీజేపీ రాష్ట్ర కమిటీలో ఆ పార్టీ ఆదివారం ప్రకటించింది. ఈ సందర్భంగా యాదగిరి, దీన్‌దయాల్ మాట్లాడుతూ జిల్లాలో బీజేపీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పీడీఎస్‌యూలో చేరిక

కోదాడ టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): న్యూడెమోక్రసీ పీడీఎస్‌యూ కోదాడ డివిజన్ కార్యదర్శి గుండు ఉమేష్ ఆదివారం కోదాడలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పీడీఎస్‌యూలో చేరారు. ఈ సందర్భంగా ఉమేష్‌ను పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు మాలోతు చందర్‌రావు, నాయకులు నాగరాజు, ఉపేందర్, గోపీ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలి

సూర్యాపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిసెంబరు 16వ తేదీన క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని తెలంగాణ బాప్టిస్టు కన్వేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రభుదాస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాప్టిస్టు చర్చిలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం పాస్టర్లను ప్రభుదాసు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు మామిడి శాంసన్, బిషప్ సల్మాన్ రాజ్, ప్రభుదాస్, పౌల్, జాన్‌మార్క్, గాబ్రియల్, జాకబ్, కిరణ్, డానియల్, బాబురావు, పూర్ణశశికాంత్, క్రిస్టియన్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఈత, తాటి వనాలు ఏర్పాటుచేయాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న బొడ్డు సాలయ్యగౌడ్

మోతె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు ప్రభుత్వం తాటి, ఈత వనాలు ఏర్పాటు చేయాలని గీత కార్మికుల సంఘం మోతె మండల నాయకుడు బొడ్డు సాలయ్యగౌడ్ కోరారు. గీత కార్మికుల సమస్యలు గుర్తించడానికి, కార్మికుల ఐక్యతను పెంచేందుకు ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గీతకార్మికుల సదస్సు నిర్వహించారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు సాలయ్యగౌడ్ వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి ఈత, తాటి వనాలు ఏర్పాటు చేయాలని, కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పింఛన్లు అందజేయాలని కోరారు. అనంతరం మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో బొడ్డు రామచంద్రగౌడ్, రాపర్తి కాటంరాజు, బొడ్డు వెంకటయ్య పాల్గొన్నారు.

పల్లెల్లో ఎన్నికల సందడి

(5వ పేజీ తరువాయి)

రొటేషన్ పద్ధతిలో మార్చినప్పటికీ జనరల్ స్థానాల్లో మహిళలకు కేటాయించారు. రెండు, మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని భావిస్తున్న తరుణంలో సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. పాలకవీడు మండలంలో 22 పంచాయతీలకు ఎస్టీలకు 7, ఎస్సీలకు 4 రిజర్వు కాగా 11 జనరల్ స్థానాలుగా ప్రకటించారు. కాగా ఈ మండలంలో బీసీలు పోటీ చేసేందుకు అవకాశం దక్కలేదు. రిజర్వేషన్ల ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ, జనరల్‌కే అవకాశం లభించింది. దీంతో ఈ మండలంలోని బీసీ నాయకులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

మూగ 'వేదన'

- పశువుల ఆస్పత్రి నిర్మించారు..సేవలు మరిచారు
- పెదవీడు పశు వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది కొరత
- రోగాలతో పశువులు..అందుబాటులో లేని మందులు

మఠంపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): లక్షలు ఖర్చుచేసి మండలంలోని పెదవీడులో పశు వైద్యశాలను నిర్మించినా, వైద్యుడిని, సిబ్బందిని నియమించనందున అలంకారప్రాయంగా మారింది. పశువులకు రోగాలు వచ్చినా, వైద్యశాలలో చికిత్స అందక, మందులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెదవీడు వైద్యశాల పరిధిలో చింత లమ్మగూడెం, పెదవీడు, మట్టపల్లి, కృష్ణతండా, గుర్రంబోడుతండా, అవిరేనికుంటతండా, బోజ్యతండా, భీమ్లాతండా, రామచంద్రాపురం, సుల్తాన్ పురంతండా, సింహపురి, లాలితండాలు ఉన్నాయి. ఈ గ్రామాలు, తండాల పరిధిలో వందల సంఖ్యలో మేకలు, గొర్రెలు, గేదెలు, ఆవులు ఉన్నాయి. వీటికి ఏ రోగం వచ్చినా వైద్యశాలకు వెళ్లాల్సిందే. కొంత కాలంగా పశు వైద్యశాలలో వైద్యుడు, సిబ్బంది లేనందున వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఈ విషయాన్ని సంబంధిత మండల, డివిజన్, జిల్లా అధికారులకు విన్నవించినా స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వానాకాలం సీజన్‌లో మూగజీవాలకు రోగాలు అధికంగా వస్తున్నాయని, దీంతో తమపై ఆర్థికంగా భారం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా జరిగినప్పుడు ఆర్భాటం చేసే అధికారులు, పాలకులు మూగజీవాలు మృత్యువాత, రోగాల బారినపడుతున్నా పట్టించు కోవడంలేదని రైతులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి పెదవీడు వైద్యశాలలో వైద్యుడు, సిబ్బందిని నియమించడంతో పాటు మందులు అందు బాటులో ఉంచి తమ సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



పెదవీడులో వైద్యుడు, సిబ్బంది లేని పశు వైద్యశాల

అధికారులు సమస్యపై దృష్టిసారించాలి



మూడు గ్రామాలతో పాటు 10తండాల పరిధిలో ఉన్న పెదవీడు పశు వైద్యశాలలో సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి. పశు వైద్యశాలలో వైద్యుడు, సిబ్బంది లేనందున రోగాలబారిన పడిన మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో జీవాలపై ఆధార పడిన రైతులు ఆర్థికంగా నష్టపోయి ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న తాధికారులు పశుపోషణ రైతుల సమస్యలను పరిష్కరించాలి.

● తెల్లబాటి శ్రీనివాస్‌గౌడ్, పెదవీడు

మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి



పశు వైద్యశాలలో వైద్యుడు, సిబ్బంది లేనందున సకాలంలో వైద్యం అందక పశువులు మృత్యువాత పడుతున్నాయి. కనీసం పశువులకు టీకాలు వేసేవారు కూడా పశు వైద్యశాలలో లేదరు. ఏదైనా జరిగినప్పుడు ఆర్భాటం చేసే అధికారులు, పాలకులు మూగజీవాలు మృత్యువాత, రోగాల బారినపడుతున్నా స్పందించకపోవడం బాధాకరం.

● షేక్ కరీం, పెదవీడు

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట



తుంగతుర్తిలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సామేలు

తుంగతుర్తి, అర్వపల్లి, నాగారం, మద్దిరాల, నూతనకల్, తిరుమలగిరి నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరెలను ఆదివారం తుంగతుర్తి, అర్వపల్లి, నాగారం, మద్దిరాలు, నూతనకల్, తిరుమలగిరి మండలాల్లో పంపిణీ చేసి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా సామాజికంగా, విద్యా పరంగా అభ్యున్నతి సాధించడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నమ్ముతోందని అన్నారు. రాష్ట్ర ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆదర్శంగా ఉందన్నారు. మహిళలకు నాణ్యమైన చీరలు పంపిణీ చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ డైరక్టర్ గుడిపాటి సైదులు, తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, ఎంపీడీవో శేషుకుమార్, రేగటి రవి, అర్వపల్లి తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో ఝాన్సీ, ఏపీఎం రాంబాబు, మోరపాక సత్యం, గుడిపెల్లి మధుకర్ రెడ్డి, కృష్ణకుమారి, నాగారం తహసీల్దార్ హరికిషోర్‌శర్మ, ఎంపీడీవో భీమ్‌సింగ్, ఏపీఎం శోభ, ఆకుల బుచ్చిబాబు, తొడుసు లింగయ్య, మద్దిరాల ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, ముక్కాల అవిలమల్లుయాదవ్, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి ఎంపీడీవో సునీత, ఏపీఎం వెంకట్‌రెడ్డి, తిరుమలగిరి తహసీల్దార్ హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేష్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లలో ప్రభుత్వ విధానం సరికాదు



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న కొప్పుల సైదిరెడ్డి

హుజూర్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్లలో ప్రభుత్వం అనుసరించిన విధానం సక్రమంగా లేదని మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ స్థానాలకు 2011 జనాభా లెక్కల ప్రకారం తీసుకోవడం సరైన విధానం కాదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. 42శాతం రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయలేదని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. పాలకవీడు మండలంలో 22 గ్రామ పంచాయతీల్లో ఏడు ఎస్టీలకు, నాలుగు ఎస్సీలకు రిజ్వర్ చేసి మిగిలిన 11 స్థానాలకు జనరల్ కు కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. పాలకవీడు మండలంలో బీసీలకు ఒక్క స్థానం కూడా కేటాయించలేదన్నారు. 2024 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీల జనాభా వివరాలు అందుబాటులో ఉన్నప్పటికి 2011 జనాభా లెక్కలు తీసుకోవడం అర్థంలేనిదని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలను మోసం చేసిందన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు కామిశెట్టి వెంకటేశ్వర్లు, షేక్. అలీపాషా, తోట నర్సింహ్మారావు, గండు సైదులు, గల్లా సైదులు, అబ్దుల్‌నబీ, అద్దంకి సైదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల తరువాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

మఠంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ప్రకటించిన 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తరువాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆ సంఘం మండల నాయకులు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన బీసీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ మఠంపల్లి మండలంలో 29 పంచాయతీలు ఉంటే కేవలం బీసీలకు కేవలం రెండు స్థానాలను మాత్రమే కేటాయించారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించారని, కానీ పంచాయతీ ఎన్నికల్లో హడావిడిగా పాత పద్ధతిలో రిజర్వేషన్ల ప్రకటించి బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. బీసీలకు ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు వెళ్లాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమీవేశంలో బీసీ సంఘాల నాయకులు జాత కిరణ్‌యాదవ్, బుచ్చయ్య, రామచంద్రయ్య, జోసుగౌడ్, బోనగిరి ప్రకాష్‌బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలుచేస్తున్న ప్రభుత్వం



టేకుమట్లలో మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్

సూర్యాపేట రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని సూర్యాపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆదివారం మండలంలోని టేకుమట్ల గ్రామంలో ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 88 మహిళ సంఘాల మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని తెలిపారు.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు హేమలత, సరిత పాల్గొన్నారు.

● పెన్‌పహాడ్: మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని అనంతారం మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గజ్జల సైదిరెడ్డి, మాజీ సర్పంచ్ షేక్ జానీ మియా, పంచాయతీ కార్యదర్శి సోమయ్య, సంఘ బంధం అధ్యక్షురాలు షేక్ అలిమామల్బూర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిడి శ్రీనివాస్, పరశురాం, వీవోఏలు షేక్ ఆశ, మామిడి వెంకటరమణ, ఉపేందర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

●ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి డీఎండబ్ల్యూ శ్రీనివాస్ నాయక్ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మిగిలిన గ్రామాల్లో పొదుపు సంఘాలు మహిళలకు పంచాయతీ కార్యదర్శులు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హసీం, ఎంపీవో ప్రియాంక, ఏపీఎం మందడి రాము, సీసీ ఇంద్దయ్య, దండు మైసమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ తంగెళ్ల కరుణాకర్‌రెడ్డి, పచ్చిపాల వెంకన్న, సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీత పాత్ర వర్ణన అభినందనీయం



ఎర్ర హరికృష్ణను న్మానిస్తున్న కవులు, రచయితలు, మేధావులు

తుంగతుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి గ్రామానికి చెందిన ఎర్ర హరికృష్ణ రచించిన సీతాయణం పుస్తకంలో సీత పాత్రను వర్ణించడం అభినందనీయమని సాగర్ల సత్తయ్య ఆదివారం మండల కేంద్రంలోని రిటైర్డు ఉద్యోగుల భవనంలో సీతాయణం పుస్తకం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు పురుషాధిక్యతలోనే పుస్తకాల రచన సాగిందని, ప్రస్తుతం దళిత, బహుజన అభ్యుదయ స్త్రీవాద భావజాలం, ఆధ్యాత్మికతను రంగరించి సీతాయనం పుస్తకం రాయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా హరికృష్ణకుఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులుగా గుండగాని శ్రీనివాస్, గుడిపాటి సైదులు, శీల అవిలేరు నాగిరెడ్డి, అరుణ జ్యోతి, పాలవరపు సంతోష్, తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, శీలం భద్రయ్య, బండారు శంకర్, సత్తెనపల్లి విప్లవకుమార్ పాల్గొన్నారు.

చిన్నారులకు చేయూత

తుంగతుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపటి గ్రామానికి చెందిన బొజ్జ మహేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య కూడా అనారోగ్యంతో గతంలోనే మృతి చెందింది. ఈ దంపతులకు కుమారుడు వరుణ్, కుమార్తె వర్షిత ఉన్నారు. ఈ ఇద్దరు చిన్నారులు నానమ్మ, తాతయ్య సంరక్షణలో ఉన్నారు. ఈ చిన్నారుల స్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రామానుజపురం గ్రామానికి చెందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అకాడమి బి హబ్ ప్రాజెక్టు మేనేజర్, వ్యక్తిత్వ వికాస శిక్షకుడు చిర్ర సతీష్, స్ఫూర్తి ఫౌండేషన్, ఎక్స్ట్రా స్మైల్ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం వెంపటి గ్రామంలో చిన్నారులకు నిత్యావసర సరుకులు, కొంత నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంపటి మాజీ సర్పంచ్ కొండగడుపుల నాగయ్య, తుంగతుర్తి జడ్పీహెచ్‌ఎస్ పీడీ కొండగడుపుల యాకయ్య, పుల్లూరు వెంకన్న, చిర్ర సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

ఆత్మకూర్(ఎస్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి పథకంలో చీరలు పంపిణీకి ఆదివారం ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రం కార్యదర్శి హాజరు కాలేదు. ఈ చీరల పంపిణీ కార్యక్రమానికి కార్యదర్శులందరూ హాజరుకావాలని ఎంపీడీవో హసిం ఒకరోజు ముందుగానే ఆదేశాలు జారీ చేశారు. అయినా కార్యదర్శి రాకపోవడం, కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో గ్రామ పంచాయతీ వద్ద మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్యదర్శి నిర్లక్ష్యంపై ఎంపీడీవో హసీం ఆగ్రహం వ్యక్తం చేసి, జిల్లా డీఎండబ్ల్యూ, ప్రత్యేక అధికారి శ్రీనివాస్ నాయక్ కు ఫిర్యాదు చేశారు.

కిరణ్‌గౌడ్‌కు డాక్టరేట్

తుంగతుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగబండ గ్రామానికి చెందిన గుండగాని కిరణ్‌కుమార్‌కు న్యాయ శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ జీబీ రెడ్డి పర్యవేక్షణలో 'డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ లెజిస్లేటివ్ పవర్స్ అండర్ 7వ షెడ్యూల్ ఆఫ్ ఇండియా కాన్సిట్యూషన్స్ - ఏ క్రిటికల్ స్టడీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను శనివారం అందుకున్నారు.

రిజర్వేషన్లకు గెజిట్ విడుదల

(5వ పేజీ తరువాయి)

మహిళలకు, 273 గ్రామపంచాయతీలు జనరల్‌కు కేటాయించారు.

ఖరారైన గ్రామపంచాయతీ రిజర్వేషన్లు

స్థానిక సంస్థల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆశావహులు ఇక ఎన్నికల పోరుకు సిద్ధం కావాల్సి ఉంది. జిల్లాలోని 23 మండలాల పరిధిలోని గ్రామపంచాయతీలు, వార్డులకు మూడు దఫాలుగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తే ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు సిద్ధంగా ఉన్నారు. నోటిఫికేషన్ తేదీల ప్రకారం జిల్లాలో ఎన్నికల నిర్వహణ షెడ్యూల్‌ను విడుదల చేయనున్నారు. పోలింగ్ కేంద్రాలు, సిబ్బందిని కూడా నియమించి ఇప్పటికే శిక్షణ కూడా పూర్తిచేశారు. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల మాదిరిగా ప్రశాంతంగా గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు.

వార్డు మెంబర్ల రిజర్వేషన్లు సిద్ధం

జిల్లాలోని 23 మండలాల పరిధిలోని 486 గ్రామపంచాయతీలల్లో 4,388 వార్డులను ఏర్పాటుచేశారు. వార్డుస్థానాలకు కూడా రిజర్వేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. మొత్తం వార్డుల్లో మహిళలకు 1,938, మిగతా 2,450వార్డులు జనరల్‌కు కేటాయించారు. ఎస్టీలకు 867 వార్డులు, ఎస్సీలకు 786 వార్డులు, బీసీలకు 770 వార్డులు, జనరల్‌కు 1,965 వార్డులను రిజర్వయ్యాయి.

సర్పంచ్ స్థానాలకు సంబంధించి

జిల్లాలోని 486 గ్రామపంచాయతీలకు సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు చేశారు. అందులో 111 గ్రామపంచాయతీలకు ఎస్టీలు, ఎస్సీలకు 91, బీసీలకు 66, జనరల్‌కు 218 గ్రామపంచాయతీలను కేటాయించారు. అందులో 213 మంది మహిళలకు, 273 గ్రామాలు జనరల్‌కు రిజర్వ్ చేశారు.

మాలధారులకు ఉపాధ్యాయుడి అన్నదానం

నూతనకల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రపహాడ్ గ్రామం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సామ నవేందర్‌రెడ్డి ఆదివారం ఆ గ్రామంలో ఉన్న అయ్యప్ప, శివ మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాలధారులు, అయ్యప్ప, శివలింగాలకు పూజలు, అర్చనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయుడు నవేందర్‌రెడ్డి దంపతులను మాలధారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో లింగాల రామచంద్రయ్య, నారగాని యాకస్వామి, రాజేష్, మల్లేష్, లింగమూర్తి, వెంకన్న, శ్రీనాథ్, భాస్కర్, పూర్ణాచారి, మధు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

హుజూర్‌నగర్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపలసింగారంలో ఇటీవల విద్యుదాఘాతంతో రాసమళ్ల కృష్ణ మృతి చెందాడు. ఆయన కుటుంబానికి 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం రూ.32,300లు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా బాపనపల్లి సాంబయ్య, కొమ్ము నాగరాజు కుటుంబాలకు రూ.70వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, సుధాకర్, రమాకాంత్, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శంకర్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు పాటుపడతాం

సూర్యాపేట టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో ఆరాధ్య ఫౌండేషన్ ముందు వరసలో ఉందని ఆరాధ్య ఫౌండేషన్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్ అన్నారు. ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వరప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పిడమర్తి లింగయ్య, మాజీ సర్పంచ్ దార శ్రీనివాస్, దుప్పగిరి, శరత్, శంకర్, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, సయ్యద్, సోమేష్, లక్మపాక కృష్ణ, మంద కమలాకర్ పాల్గొన్నారు.

బీరవెల్లి కృష్ణారెడ్డి బాధాకరం



బీరవెల్లి కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

సూర్యాపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి సతీమణి లావణ్య తండ్రి బీరవెల్లి కృష్ణారెడ్డి మృతి బాధాకరమని పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య శాఖ, క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కృష్ణారెడ్డి సంతాప సభలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూరరా మూర్తియాదవ్, పెద్దిరెడ్డిరాజా, జ్యోతికర్ణాకర్, దరావత్ వెంకన్ననాయక్, బైరబోయిన శ్రీనివాస్, ఉపేందర్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి

నూతనకల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా టీపీయూఎస్ మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా యామ సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా లింగాల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లింగంపల్లి శ్రీనివాస్, శ్రీదేవి, సువర్ణలక్ష్మి, స్వాతి పాల్గొన్నారు.

ఆర్య వైశ్య మండల కమిటీ ఎన్నిక

నూతనకల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల ఆర్యవైశ్య నూతన కమిటిని ఆదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుండా విశ్వనాథం, కార్యదర్శిగా ఉప్పల రాజలింగం, కోశాధికారిగా యాద వెంకన్న, కార్యవర్గ సభ్యులుగా తాటికొండ నరేందర్, దారం లక్ష్మీనరసయ్య, మాశెట్టి సోమన్న, మహంకాళి నాగేశ్వర్‌రావు, జగిని వెంకన్న పాటు మరి కొందరిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, జగదీశ్వర్ పాల్గొన్నారు.